ఘనంగా వంజరి మహిళా సదస్సు


మాట్లాడుతున్న భారతీయం సత్యవాణి

లాలాపేట: తెలంగాణ వంజరి సంఘం ఆధ్వర్యంలో సోమవారం తార్నాకలో వంజరి భవన్‌లో మహిళా దినోత్స వేడుకల్లో భాగంగా వంజరి మహిళా సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భారతీయం సత్యవాణి ముఖ్య వక్తగా హాజరై మాట్లాడుతూ.. మహిళ చైతన్య స్వరూపిణి అని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మంలో మహిళల గొప్పతనాన్ని అందరికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు భానుక నర్మద, వంజరి సంఘం నాయకురాళ్లు బొగ్గుల సునీత, అనురాధ, దాత్రిక సాయిరంజనీ, సాల్వేరు దేవిక, ఆరె గీత, శోభ, విజయలక్ష్మి తదితరులున్నారు.

ఓయూలో సీఎం దిష్టిబొమ్మ దహనం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఏబీవీపీ నాయకులు సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట దహనం చేశారు. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను విక్రయించవద్దని, విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శివశంకర్, కోటి, కల్యాణ్, రాజేందర్, అన్వేష్, భాస్కర్, సాయితేజ, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


గంభీర్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అస్సాం వాసి అదృశ్యమైన కేసు సోమవారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం..అస్సాం రాయిదొంగల గ్రామానికి చెందిన బోర బిను, బోర గంభీర్ దంపతులు. వీరిరువురు మేడ్చల్ జిల్లా అత్వెల్లి గ్రామంలో నివాసం ఉంటూ కొంపెల్లిలో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లిన వీరు పిల్లలతో గౌహతి ఎక్స్‌ప్రెస్ రైలులో తిరిగి సికింద్రాబాద్‌కు బయలుదేరారు. ఈనెల 29 సికింద్రాబాద్ 6వ నెంబర్ ప్లాట్‌ఫామ్ మీద రైలు దిగి స్టేషన్ బయటి నుంచి మేడ్చల్ డిపో బస్ ఎక్కి వెళ్లేందుకు 1వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్నారు. జనం రద్దీ ఎక్కువ ఉన్న కారణంగా బిను భర్త గంభీర్ కనిపించకుండా పోయాడు. రైల్వేస్టేషన్ అంతటా భర్త కోసం ఆరా తీసినా బినుకు ఆచూకీ లభించలేదు. అత్వెల్లికి వెళ్లి ఇంటి సమీపంలో వెతికినా గంభీర్ ఆచూకీ లభ్యం కాలేదు. బంధుమిత్రుల వద్ద గంభీర్ వివరాలు లభించకపోవడంతో సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఆశ్రయించిన బిను ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీగా సమ్మయ్య



బంజారాహిల్స్: జూబ్లీ హిల్స్ సర్కిల్–18 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌గా సమ్మయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు ఆయన బేగంపేట సర్కిల్–30 డీసీగా వ్యవహరిస్తున్నారు. సర్కిల్–18 డీసీగా ఉన్న ప్రశాంతిని శేరిలింగంపల్లి సర్కిల్–20 డీసీగా బదిలీ చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ డీసీగా ఉన్న ముకుందరెడ్డి ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ప్రశాంతిని నియమించారు. ప్రశాంతి స్థానంలో జూబ్లీహిల్స్ సర్కిల్‌కు సమ్మయ్యను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 17, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చ కాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 23, దొండ 35, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 50, గోకరకాయ 45, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.


కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు


సనత్‌నగర్ అశోక్‌కాలనీలోని జాఫ్రీ మసీదు వద్ద..


కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విశాల్ సూదంకు శుభాకాంక్షలు చెబుతున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

పవిత్ర రంజాన్ వేడుకలను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల పరిధిలోని పలు ఈద్గాలు, మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. మహ్మద్ ప్రవక్త సూచించిన వాక్యాలను మత పెద్దలు చదివి వినిపించారు. ఉదయం నుంచే ముస్లింలు ఈద్గాలు, మసీదుల్లో కలుసుకుని ఆత్మీయ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. షీర్ కూర్మాను ఒకరికొకరు తినిపించుకుని నోళ్లను తీపి చేసుకున్నారు. పలుచోట్ల జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

– సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ జోన్ల బృందం


బోయిగూడలో...


శేషపహాడ్‌లోని ఈద్గాలో..


మత పెద్దలను సత్కరిస్తున్న లాలాగూడ మసీద్ కమిటీ ప్రతినిధులు


బాలంరాయి ఈద్గా వద్ద..


తార్నాకలో..శుభాకాంక్షలు తెలుపుతున్న ఆలకుంట హరి


నల్లగుట్ట మసీదులో.. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


బన్సీలాల్‌పేట్‌లో...

హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపివేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపివేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ..హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు విక్రయించి తద్వారా ధనాన్ని ఆర్జించాలనుకోవడం దారుణమన్నారు. వర్సిటీ భూమి కాపాడుకునేందుకు విద్యార్థులు చేస్తున్న ఆందోళనలకు మద్దతు తెలిపారు. విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జి అరెస్టులను తీవ్రంగా ఖండిచారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యూ నాయకులు ప్రశాంత్, టోనీ, రవి, శ్రీధర్‌యాదవ్, సురేష్, గోవర్ధన్, మహేష్, గోపి, ఆనంద్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌సీయూ భూముల కోసం ఓయూలో పీఎస్‌యూ నిరసన

మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలి


మాట్లాడుతున్న వెంకటేష్ చౌహాన్

పంజగుట్ట: మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించకపోతే కాంగ్రెస్ పార్టీకి నష్టం తప్పదని గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ, గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో లంబాడీల పాత్ర ఎంతో ఉందని, యావత్ బంజారాలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి గెలిపించారని పేర్కొన్నారు. మంత్రివర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ప్రభుత్వం బంజారాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోతే బంజారాలు పార్టీకి దూరమయ్యే అవకాశం ఉందని చెప్పారు. కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, కె.సి.వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజ్‌ను కలిసి వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు అశోక్ రాథోడ్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీకి వినతిపత్రాలు ఇచ్చామని, ఇకపై నిరసన కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ అధ్యక్షుడు సురేష్‌నాయక్, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్పతి నాయక్, బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివనాయక్, కొండ్రపల్లి రమేష్, రాజు నాయక్, శివ చౌహాన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించండి

బౌద్ధనగర్: ఒక వైపు పేదలకు రూ.5లకే భోజనం పెడుతున్నారు..కానీ అదే ప్రాంతంలో రోజు జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెత్తతో నింపేస్తున్నారు. వారాసీగూడ ప్రధాన రహదారిలోని సెయింట్ జాన్స్ స్కూల్ సమీపంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కొన్ని ఏళ్ల నుంచి రూ.5 భోజనం అందుబాటులో ఉంచుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఇక్కడ పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ భోజనాన్ని ఆరగిస్తుంటారు. అయితే కొంత మంది జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బంది ఎక్కడి నుంచో చెత్తను తీసుకుని వచ్చి ఈ భోజనం ముందు పడేస్తున్నారు. మధ్యాహ్నం భోజనం సమయానికి కూడా చెత్తను అలాగే ఉంచుతున్నారు. దీంతో భోజనం చేసే వాళ్లు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. భోజనం సమయంలో ఈ చెత్తతో ఏదైనా రోగాలు వ్యాప్తి చెందుతాయేమోనని ఆందోళన ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎప్పటికీ ఇక్కడ చెత్తను వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


వారాసీగూడ ప్రధాన రహదారిలో రూ.5 భోజనం ముందు పడేసిన చెత్త

లంబాడీల మాతృ భాషకు ప్రాధాన్యమివ్వడం హర్షణీయం

అమీర్‌పేట: లంబాడీల మాతృ భాష గోర్ బోలీకి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించడం హర్షణీయమని బాపూనగర్ బంజార వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కుర్నాల్ కాథోడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోర్ బోలీని చేర్చాలని మార్చి 28వ తెలంగాణ శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించారని తెలిపారు. భాషా వైవిధ్యాన్ని ప్రోత్సహించేలా, తెలంగాణ సంస్కృతిలో భాగమైన లంబాడీలకు గుర్తింపును తెచ్చేందుకు ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ప్రజా ప్రతినిధులకు లంబాడీల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న బాలనాగమ్మ నాటకం


బాల నాగమ్మ నాటకంలో రంగస్థల నటుల అభినయం

ఫిలింనగర్: ఫిలినగర్‌లోని ఫిలింఛాంబర్ రామానాయుడు కళామండపంలో ఉగాది నాటకోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పొత్తూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించే నాటకోత్సవాల్లో సోమవారం ఉయ్యూరుకు చెందిన శ్రీదేవి కళా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన బాలనాగమ్మ జానపద నాటకం అలరించింది. బాలనాగమ్మగా వీరమణి, కార్యవర్ధిగా సోమర ఎర్రస్వామి చౌదరి, ఫకీర్‌గా జెట్టి సాంబశివరావు, పులిరాజుగా ముత్యాల నాగేశ్వర్‌రావు, సంగుగా ఇంద్రజ, తిప్పడుగా ఈగ నాగేశ్వర్‌రావు, లచ్చిగా మనుప్రియ, జంగమ దేవరగా రాధాకృష్ణ నటించారు. రంగస్థల కళాకారులను ప్రోత్సహించడంతో పాటు నేటితరం యువతకు, సినీ ప్రేమికులకు రంగస్థల నాటికలను పరిచయం చేసే ప్రయత్నమే ఈ కార్యక్రమం అని సుబ్బారావు తెలిపారు. ఫినిక్స్ ఫౌండేషన్ చైర్మన్ చుక్కపల్లి సురేష్, చుక్కపల్లి అవినాష్, సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, చార్టెడ్ అకౌంటెంట్ దేవనాథ్ సూరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెక్ కాలనీ ఫెడరేషన్ ఆవిర్భావోత్సవం


ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ప్రతినిధులు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలను కాలనీ నాలుగో రోడ్డులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆహూతులను అలరించాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకలకు గ్రీన్‌సిటీ అధినేత కొండ్రాజు సుబ్బరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీవాసులంతా ఐక్యమత్యంగా ఉండటం ద్వారా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఫెడరేషన్ ఫౌండర్ సెక్రటరీ డీవీ రంగరాజు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఓఎస్‌డీ వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లు ప్రసాద్, రాజశేఖర్ చందులు అతిథులను సన్మానించారు. కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు జ్ఞాపికలతో పాటు బహుమతులను ప్రదానం చేశారు. కాలనీ ప్రతినిధులు అనంతరెడ్డి, శివారెడ్డి, విశ్వనాథరాజు, వెంకట్ సోమ, నాగిరెడ్డి, కంజర్ల శ్రీనివాస్‌యాదవ్, వెల్లంకి శారద, బిల్డర్ రాజా, శ్రీనివాస్‌రెడ్డి, శశికళ, రామసుబ్బారెడ్డి, లక్ష్మారెడ్డి, సుదర్శన్‌రావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు బహుమతులిస్తున్న సుబ్బరాజు

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖర్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సమావేశం బీదలబస్తీ గ్రౌండ్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో సంఘం నూతన అధ్యక్షుడిగా జి.చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గద్దం ప్రసాద్, ఏఎస్.చలపతిగిరి, అంబాల రాజేశ్వరరావు, జీవీ కృష్ణ, లలిత, గోవర్ధన్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా ఏఎస్.భాస్కర్‌గిరి, సురేందర్, కార్యదర్శులుగా సుధాకర్, ధనుష్‌బాబు, దిలీప్ కుమార్, పి.శివ ప్రసాద్, లక్ష్మి, కోశాధికారిగా పోతారం శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జి.కిషోర్, యశ్వంత్, ఎం.మనోజ్, జి.మహేష్ ఎన్నియ్యారు. కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్, సాయినాథ్, రవికాంత్, సందీప్, కిరణ్ కుమార్‌లను ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సంఘం నూతన కార్యవర్గ సమావేశంలో డాక్టర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.


చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న సంఘం ప్రతినిధులు

సన్న బియ్యం పంపిణీకి బ్రేక్

బంజారాహిల్స్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈనెల 1వ తేదీ నుంచి ఇవ్వాల్సిన సన్నబియ్యం పంపిణీకి బ్రేక్ పడింది. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలోని 81 రేషన్‌షాపుల పరిధిలో రూ.2,95,779 మంది కార్డుదారులకు తీవ్ర నిరాశే మిగిలింది. ఉగాది కానుకగా వీరందరికీ ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే కోడ్ నేపథ్యంలో సన్న బియ్యం పంపిణీ చేపట్టవద్దని ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో సర్కిల్–7 పరిధిలో ఏప్రిల్ నెల కోటా కింద దొడ్డి బియ్యాన్ని పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించారు. సన్న బియ్యం బస్తాలు ఒక మూలన పెట్టాలని కూడా ఆదేశించారు. అన్ని రేషన్ షాపులు దొడ్డి బియ్యం పంపిణీ చేయనున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఏప్రిల్ 29 వరకు అమలులో ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్ నెల కోటా కింద సన్న బియ్యం ఇవ్వడం లేదని, మే నెల నుంచి పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

